ఈనాడు
చిత్తూరు
గురువారం అక్టోబరు 24, 2024

ఆలోచన అదిరే.. విజయం దరిచేరే

డ్రోన్ హ్యాకథాన్‌లో మెరిసిన ఐఐటీ విద్యార్థులు



ఈనాడు డిజిటల్, తిరుపతి: బుల్లి డ్రోన్లు అద్భుతాలకు వేదికవుతున్నాయి. వాటిలో వస్తున్న ఆవిష్కరణలు మానవాళి అవసరాలకు ఆయువుపట్టుగా నిలుస్తున్నాయి. తిరుపతి ఐఐటీ వాటికి వేదికవుతున్నాయి. అమరావతిలో రెండు రోజులపాటు జరిగిన డ్రోన్ సమ్మిట్‌లో తొలిరోజే రాణించి బహుమతి అందుకుంది. విపత్తులు, అత్యవసర సేవలు, మారుమూల ప్రాంతాలకు మందుల చేరవేత, రవాణా కేటగిరిలో 67.2 పాయింట్లు సాధించి ద్వితీయ విభాగంలో తృతీయ బహుమతి కింద రూ.50,000 గెలుచుకోగా.. ఇతర ఆవిష్కరణలూ ప్రత్యేకత చాటుతున్నాయి.



ప్రాణాపాయంలో చేయూత

ఆవిష్కరణ: రియల్‌టైం పీపుల్ ట్రాకింగ్ ఇన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్

బృందం: డా.సీహెచ్.విష్ణు (అసిస్టెంట్ ప్రొఫెసర్), అయూష్ బిక్వాల్, హరియోమ్ మీనా, దీపక్ యాదవ్ (ఎంటెక్, సీఎస్సీ), శుభం కుమార్ (మాస్టర్స్ రీసెర్చ్, సీఎస్సీ)



ఉపయోగమిలా: వరదలు సంభవించినప్పుడు ఆ వరదల్లో మునిగిపోతున్న మనుషులు, వాహనాలు, జంతువులు ఇలా వేర్వేరుగా గుర్తించడం కష్టం. కొన్ని సందర్భాల్లో మనుషులు అనుకొని వస్తువులను దక్కించుకోవడంతో ప్రాణనష్టం తీవ్రంగా ఉంటుంది. అలాంటి ఘటనలకు చెక్ పెట్టేందుకు 'రియల్ టైం పీపుల్ ట్రాకింగ్ ఇన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' ఆవిష్కరణ ఉపయోగపడనుంది. ఇతర డ్రోన్లు వరదల్లో కొట్టుకుపోయి సగం మాత్రమే కనిపించే వ్యక్తులను గుర్తించలేవు. ఈ ఆవిష్కరణ మాత్రం సగం శరీరం కనిపించే వ్యక్తులను సైతం గుర్తించి సమాచారాన్ని చేరవేస్తుంది. వ్యక్తుల ప్రాణాలను కాపాడటంలో ముందుంటుంది.

విపత్తుల్లోనూ సిగ్నళ్లు

ఆవిష్కరణ: ఏరియల్ బేస్ స్టేషన్ టు రీస్టోర్ నెట్‌వర్క్

బృందం: డా.సర్వేంద్రనాథ్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, శామ్యూల్ మర్గాని (డ్రోన్ హబ్ డైరెక్టర్), విమలన్ (సిస్టమ్ ఇంజినీర్), అక్షయ్ (డెవలప్‌మెంట్ ఇంజినీర్)



ఉపయోగమిలా: భారీ వర్షాలకు విద్యుత్తు అంతరాయం ఏర్పడటం, స్తంభాలు విరిగిపడటంతోపాటు సిగ్నలింగ్ వ్యవస్థ పూర్తిస్థాయిలో దెబ్బతింటుంది. ప్రమాదంలో ఉన్నవాళ్లను కాపాడే చివరి అవకాశం ఉన్నా ఆ సందర్భంలో కోల్పోతాం. అలాంటి ఘటనల్లో ప్రాణనష్టం జరగకుండా చూసేందుకు ఈ తరహా డ్రోన్ ఆవిష్కరణ చేశారు. ఇందుకు రెండురకాల డ్రోన్లను ఏరియల్ బేస్ స్టేషన్‌లో ఉపయోగిస్తారు. మొదటిది బ్యాటరీ సాయంతో దాదాపు మూడు గంటలపాటు తాత్కాలిక సిగ్నల్‌ను సరఫరా చేస్తుంది. రెండోది తీగల సాయంతో దాదాపు 24 గంటలపాటు గాలిలోనే సిగ్నల్ వ్యవస్థను మోసుకెళ్తుంది. వీటిద్వారా ఎస్ఓఎస్ ప్రక్రియ నడుస్తుంది. సిగ్నల్ ఆధారంగా ప్రమాదంలో ఉన్నవాళ్లను రక్షించొచ్చు. విజయవాడ డ్రోన్ హబ్, తిరుపతి ఐఐటీల భాగస్వామ్యంలో దీన్ని ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ తొలిరోజే తృతీయ బహుమతి గెలుచుకుంది.

రైతుకు రక్షకుడిలా..

ఆవిష్కరణ : క్రాప్ ఈల్డ్ ప్రిడిక్షన్ అండ్ ఫెయిల్యూర్ అలర్ట్

ఉపయోగమిలా: అమెరికా, యూరప్ వంటి దేశాల్లో డ్రోన్లను ఉపయోగించే వ్యవసాయం చేస్తారు. పంట వేసే సమయం నుంచి చేతికొచ్చేవరకు డ్రోనే రక్షకుడిలాగా కాపలా కాస్తుంది. పంట రోగాలను గుర్తించి రైతుకు సమాచారమిస్తుంది. అలాంటి ఆవిష్కరణే ఇక్కడా చేయాలనే సంకల్పంతో ఈ ఆవిష్కరణ చేశారు. పంటను ఆశించే రోగాలను 30 రోజుల ముందే కనిపెట్టడం ఈ డ్రోన్ పని. నేరుగా నిర్దేశిత పంటను చేరుకొని పని కానిచ్చే రైతుకు అండగా సేవలు అందిస్తుంది.

వరదల్లో చిక్కుకున్న వారికి..

ఆవిష్కరణ: డిటెక్షన్ ఆఫ్ పర్సన్ ఫ్రం డ్రోన్ ఫుటేజ్

బృందం: రామకృష్ణ సాయి, (ప్రొఫెసర్), వినాయక్ నగేలి (సొల్యూషన్ డిజైనర్), గణేశ్ (డెవలపర్), దీపక్ యాదవ్ (పీజీ)


'డిటెక్షన్ ఆఫ్ పర్సన్ ఫ్రమ్ డ్రోన్ ఫుటేజ్' డ్రోన్ డెమో

ఉపయోగమిలా: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలను కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం సర్వసాధారణం. ప్రమాదంలో చిక్కుకున్న వాళ్లను కాపాడాలంటే ముందుగా వాళ్లు ఎక్కడ ఉన్నారనేది గుర్తించాలి. అలాంటి పనినే ఈ డ్రోన్ చేస్తుంది. డ్రోన్ సాయంతో పైనుంచి గాలింపు చర్యలు చేపట్టినా కింద ఉన్నవారు చిన్నగా కనిపించడంతో వాళ్లను గుర్తించడం కష్టంగా మారుతోంది. అలాంటి సమయంలో వీరు రూపొందించిన డ్రోన్ వీడియో తీసి నేరుగా అధికారులకు సమాచారం చేరవేస్తుంది. వాళ్ల ముఖాలను స్కాన్‌చేసి గుర్తిస్తుంది. వరదల్లో చిక్కుకున్న వాళ్లను రక్షించేందుకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది.

వ్యాపారానికి తరుణం.. అతివలకు అందలం

పొదుపు సంఘాల మహిళలకు విరివిగా రుణాలు


స్వయం సహాయక సంఘాల మహిళలు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మహిళలు సంపద సృష్టించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయి. వారు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 74,536 సంఘాలకు రూ.3 వేల కోట్లు రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

◆ ఎస్సీ, ఎస్టీ పొదుపు మహిళల జీవనోపాధులు మెరుగుపరిచేందుకు మహిళా శక్తి పేరుతో సుస్థిర జీవనోపాధి కల్పనలో భాగంగా అప్పి, అల్ఫా, బజాజ్ ఆటోలు, ప్రజా, వస్తువుల రవాణా ఆటోలకు రుణాలు మంజూరు చేస్తున్నారు. లబ్ధిదారులు పది శాతం వాటా చెల్లిస్తే రుణాలిస్తున్నారు. యూనిట్ విలువ మొత్తాన్ని 48 ఈఎంఐలలో చెల్లించాల్సి ఉంటుంది.

◆ పీఎంఎఫ్ఎంఈ (ప్రధానమంత్రి ఫార్మలేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ స్కీం), ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సహకారంతో రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు యంత్రాల కొనుగోలుకు రుణాలు మంజూరు చేస్తున్నారు.

◆ ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా వ్యక్తిగతంగా లేదా సంఘాల ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. పీఎంఎఫ్ఎంఈ కింద రాయితీలు ఆశాజనకంగా ఉన్నాయి. రూ.10 లక్షల యూనిట్ ఖర్చుతో ఏర్పాటు చేసే పరిశ్రమలకు లైసెన్సులు, జీఎస్టీలు ఇతరత్రా ఏమీ అవసరం లేదు.

◆ పరిశ్రమల ఏర్పాటుకు 35 శాతం రాయితీ వర్తిస్తుంది. వ్యాపారాభివృద్ధికి అవసరమైన అధునాతన పరికరాల కొనుగోలుకు, వర్క్ షెడ్ల నిర్మాణాలకయ్యే వ్యయంలో పది శాతం పెట్టుబడి పెడితే చాలు. ప్రభుత్వం బ్యాంకు ద్వారా 90 శాతం రుణ సదుపాయం కల్పిస్తుంది.

స్త్రీనిధి.. పెన్నిధి

గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో పొదుపు మహిళలు 'స్త్రీనిధి' బ్యాంకును ఏర్పాటు చేశారు. దీని ద్వారా రుణాలు పొంది చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించవచ్చు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ ఏడాది రూ.315 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.175 కోట్లు ఇచ్చారు. రూ.50 వేల వరకు రుణం తీసుకుంటే 24 నెలలకు గాను రూ.10 వేలు వడ్డీతో కలిపి రూ.60 వేలు చెల్లించాలి.

ఉన్నతికి వడ్డీ లేకుండా..

'ఉన్నతి' కార్యక్రమాన్ని 2008-09 నుంచి అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 2023-24 సంవత్సరంలో 5,027 మందికి రూ.24 కోట్లు వడ్డీ లేని రుణం ఇచ్చారు. 2024-25లో 6 వేల మందికి రూ.28.35 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ 1768 మందికి రూ.8.48 కోట్ల రుణాలు ఇచ్చారు.

ఎన్టీఆర్ జలాశయ అభివృద్ధికి కృషి

పెనుమూరు, న్యూస్‌టుడే: చిత్తూరు ప్రజల తాగునీటి అవసరాల కోసం నిర్మించిన ఎన్టీఆర్ జలాశయం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీ మోహన్ అన్నారు. బుధవారం వారు జలాశయానికి జలహారతి ఇచ్చి సారె సమర్పించారు. త్వరలో చిత్తూరుకు అడవిపల్లె రిజర్వాయర్ నీటిని తెస్తామని చెప్పారు. ఎన్టీఆర్ జలాశయం నుంచి అదనంగా ఐదు ఎంపీల్లెల నీటి వినియోగానికి ప్రతిపాదిస్తున్నామన్నారు. మేయర్ అముద, ఉప మేయర్ రాజేశ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దొరబాబు, కమిషనర్ నరసింహప్రసాద్, జల వనరుల శాఖ ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి, ఈఈ మురళి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో చిత్తూరుకు అడవిపల్లె రిజర్వాయర్ నీరు


హారతి ఇస్తున్న ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్ తదితరులు

చెరువులకు జలకళ

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఇటీవల వర్షాలు పడ్డాయి. రెండు రోజుల కిందట పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. చెరువులకు నీరు చేరుతుండటంతో జలకళ సంతరించుకుంటున్నాయి. జిల్లాలో 4,122 చెరువులు ఉండగా.. 3,128 చెరువులు 25 నుంచి వంద శాతం నిండాయని తెలిపారు. పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్ జలాశయం పూర్తిగా జలకళ సంతరించుకోవడంతో.. వరద నీటిని గేట్ల ద్వారా కిందికి వదులుతున్నారు.

చెరువుల్లో నీటి చేరిక ఇలా..

చెరువులు	శాతం
133	100
281	75
1,252	50
1,462	25–50
992	0


తవణంపల్లె మండలంలో మొరవ పారుతున్న ఉత్తరబ్రాహ్మణపల్లి చెరువు

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల: ఎస్‌ఎస్‌డీ టోకెన్లు లేకుండా బుధవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 6 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. మంగళవారం శ్రీవారిని 64,359 మంది దర్శించుకోగా రూ.3.59 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

రేపటి నుంచి జాతీయ పశుగణన

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో 21వ జాతీయ పశుగణనను ఈ నెల 25 నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్ తెలిపారు. పశుగణన చేపట్టే గణనకర్తలు(ఎన్యుమరేటర్లు), సూపర్‌వైజర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. ఫిబ్రవరి 28 వరకు జరిగే పశుగణన పక్కాగా నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 4,60,076 నివాసాలను గణన చేయాల్సి ఉందని, ఇందుకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ రానుందని చెప్పారు. పశుగణన పర్యవేక్షణకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలో అధికారులను నియమించామని తెలిపారు.

తుక్కుటమారీలు ఎవరు?

◆ విద్యుత్తు స్క్రాప్‌లో రూ.9 కోట్లు స్వాహా ◆ దర్యాప్తునకు రంగంలోకి విజిలెన్స్ విభాగం

చిత్తూరు (మిట్టూరు): విద్యుత్తు శాఖలో కాలిపోయి.. తుప్పు పట్టిన తీగలు, కమ్మీల నుంచి దిగమింగిన తుక్కు లెక్క మరింతగా పెరిగింది. ఏళ్లకు ఏళ్లే వైకాపా పాలనలో విద్యుత్తు శాఖలో అవినీతి అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. అడిగేవారు లేరు. చూసేవారే లేరు. మరి ఇంకేం అన్న తరహాలో దోచుకున్నోళ్లకు దోచుకున్నంతగా నియంత్రికల మరమ్మతు కేంద్రాల్లో రూ.కోట్లు దిగమింగారు. చిత్తూరు జిల్లాలోని పలమనేరు, అన్నమయ్య జిల్లాలోని పీలేరు నియంత్రికల మరమ్మతు కేంద్రాల్లో తుప్పుపట్టిన వైర్ల(స్క్రాప్) పక్కదారి పట్టించి రూ.3.50 కోట్లు స్వాహా చేసినట్లు గత నెలలో 'ఈనాడు' వెలుగులోకి తెచ్చింది. తర్వాత విద్యుత్తు శాఖ అధికారుల ప్రాథమిక విచారణలో ఒక్క పలమనేరు కేంద్రంలోనే రూ.7 కోట్లు, పీలేరులో రూ.2 కోట్లు మొత్తం రూ.9 కోట్లు స్వాహా జరిగినట్లు ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం.


చిత్తూరులోని నియంత్రికల మరమ్మతు కేంద్రం

అధికారుల్లో గుబులు

విజిలెన్స్ విచారణ వేగవంతంతో కొందరు అధికారుల్లో గుబులు మొదలైంది. తుప్పు పక్కదారి ఒక్క రోజులో జరగదని.. కొన్ని నెలల పాటు జరుగుతున్నా మరమ్మతు కేంద్రాల పర్యవేక్షణ అధికారులు పట్టించుకోకపోవడంతో వారి పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కోణంలో కూడా విజిలెన్స్ విభాగం దర్యాప్తు చేపట్టనుంది. ఎన్ని రూ.కోట్లు స్వాహా జరిగింది? ఎంత మంది అధికారులు, సిబ్బంది ప్రమేయం ఉందో దర్యాప్తులో తేలనుంది.

స్వాహా ఇలా..

ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యుత్తు శాఖలో ఎనిమిది మరమ్మతు కేంద్రాలున్నాయి. కాలిపోయిన నియంత్రికలను ఈ కేంద్రాలకు తరలిస్తే మరమ్మతు చేసి అప్పగిస్తారు. ఒకవేళ నియంత్రిక పనికి రాదనుకుంటే విద్యుత్తు శాఖ గోదాముకు అప్పగించి కొత్తదాన్ని అందజేస్తారు. ఈ సమయంలో కాలిపోయిన, తుప్పు పట్టిన వైర్లను గోదాములో అప్పగించాలి. ప్రైవేటు గోదాములో ఇలా జరిగినా.. ఆయా వైర్లను గోదాముకు స్వాధీనం చేయాలి. అయితే నిబంధనలకు విరుద్ధంగా కేంద్రాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది తుక్కును గోదాముకు అప్పగించకుండా.. పూర్తిగా పక్కదారి పట్టించి రూ.9 కోట్లు స్వాహా చేశారు.

నాలుగేళ్ల వివరాలు సమర్పించండి

తుప్పు పట్టిన వైరు పక్కదారి పట్టించి నిధులు స్వాహా చేసిన కేసు దర్యాప్తునకు విద్యుత్తు శాఖ పరిధిలోని యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్ (ఏపీటీఎస్) విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎనిమిది నియంత్రికల మరమ్మతు కేంద్రాల్లో నాలుగేళ్ల లెక్కలను విజిలెన్స్ అధికారులు క్షుణ్నంగా పరిశీలించనున్నారు. ఈ కేంద్రాల్లో ఎన్ని నియంత్రికలు మరమ్మతు చేశారు? ఎన్ని రైతులకు అందజేశారు? ఎంత రాగి, అల్యూమినియం తీగ కేంద్రాలకు సరఫరా అయ్యింది..? తుప్పు పట్టిన వైరు ఎంత గోదాముకు అప్పగించారు? నోటిఫికేషన్ ద్వారా అందజేసిన నియంత్రికల సంఖ్య, నోటిఫికేషన్ లేకుండా ఎన్ని ఇచ్చారు? తదితర వివరాల సేకరణలో విజిలెన్స్ అధికారులు నిమగ్నమయ్యారు. 15-20 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయనున్నామని విజిలెన్స్ విభాగం సీఐ సుబ్రహ్మణ్యంరెడ్డి తెలిపారు.

టీకాలు వేయించండి.. చిత్తూరు(వైద్యవిభాగం): శిశువులకు విధిగా వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ప్రభావతిదేవి వైద్యాధికారులను ఆదేశించారు.

30 రోజుల్లో 300 చరవాణుల రికవరీ

చిత్తూరు (నేరవార్తలు): 'జిల్లా పోలీసు శాఖలోని చాట్‌బాట్ విభాగం ద్వారా తొమ్మిదో విడతలో చోరీకి గురైన, జారవిడుచుకున్న రూ.65 లక్షలు విలువ చేసే 300 చరవాణులను 30 రోజుల్లో రికవరీ చేశాం. వాటిని బాధితులకు అప్పగించి వారి కళ్లలో ఆనందాన్ని చూశాం' అని ఎస్పీ మణికంఠ తెలిపారు. చిత్తూరు పోలీసు అతిథిగృహంలో బుధవారం మొబైల్ రికవరీ మేళాలో ఆయన మాట్లాడారు. చరవాణులు చోరీకి గురైనా, తప్పిపోయినా చాట్‌బాట్ నంబరు 94409 00004కు హాయ్ లేక హెల్ప్ అని వాట్సప్ సందేశం పంపితే దర్యాప్తు చేస్తామన్నారు. ఇప్పటి వరకు తొమ్మిది దశల్లో రూ.5.61 కోట్లు విలువ చేసే 2,635 చరవాణులు రికవరీ చేశామన్నారు. రికవరీ కోసం కృషి చేసిన చిత్తూరు క్రైం సీఐ ఉమామహేశ్వరరావు, చాట్‌బాట్ సిబ్బంది బాపూజీ, శ్రీనివాసన్, రఘులను ఆయన అభినందించి, సత్కరించారు. ఏఆర్ ఏఎస్పీ శివానందకిషోర్ పాల్గొన్నారు.


బాధితులకు చరవాణులు అప్పగిస్తున్న ఎస్పీ మణికంఠ, పోలీసు అధికారులు

అర్జీదారులను తిప్పించుకోవద్దు: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందే అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, అర్జీదారులను తిప్పించుకోవద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంపై కలెక్టరేట్ నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల అధికారులతో ఆయన మాట్లాడారు. 'ఈ ఏడాది జూన్ 15 నుంచి ఇప్పటి వరకు 8,996 ఫిర్యాదులు నమోదు కాగా 6,399 అర్జీల్ని నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాం. రీ-ఓపెన్ అర్జీల్లో ఇంకా 118 పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి అర్జీని ఆడిట్ చేస్తాం. అర్జీదారులకు సమస్యల పరిష్కారంపై సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలి. ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి సర్వే ప్రక్రియను ఈ నెల 30లోగా పూర్తిచేయాలి. ఆధార్ కార్డులేని గిరిజనులకు ఆధార్ కార్డుల్ని మంజూరు చేయాలని' పేర్కొన్నారు. డీఆర్వో పుల్లయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

● ఉపాధి హామీ పథకంలో చేపట్టిన 157 పనుల బిల్లుల్ని శనివారం లోగా అప్‌లోడ్ చేయాలని ఆ శాఖ అధికారులతో జరిగిన సమీక్షలో కలెక్టర్ పేర్కొన్నారు.

ఏఆర్ ఏఎస్పీ బాధ్యతల స్వీకరణ


శివానందకిషోర్

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు ఆర్మ్‌డ్ రిజర్వు ఏఎస్పీగా ఆర్.శివానందకిషోర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆ స్థానంలో ఉన్న నాగేశ్వరరావు కాకినాడ ఏఆర్ ఏఎస్పీగా బదిలీ కావడంతో తిరుమల విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా ఉన్న ఈయన ఉద్యోగోన్నతిపై చిత్తూరు ఏఆర్ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

29న సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీలు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: ఆలిండియా సివిల్ సర్వీసు ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలను ఈ నెల 29న చిత్తూరులోని మెసానికల్ మైదానంలో నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో బాలాజీ తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, లాన్ టెన్నిస్, హాకీ, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, క్యారమ్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, ఖోఖో, క్రికెట్, వెయిట్ లిఫ్టింగ్/పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, స్విమ్మింగ్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల ఉద్యోగులు ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీలోగా తమను సంప్రదించాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైనవారు నవంబరులో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

ముంచేసిన ముసురు

☛ దెబ్బతిన్న ఉద్యాన పంటలు
☛ నష్టాల్లో రైతులు


బైరెడ్డిపల్లె మండలం చిన్నపురం వద్ద వర్షానికి కుళ్లిపోయిన కాలీఫ్లవర్ పంట


పెద్దపంజాణి మండలం బసవరాజుకండ్రిగ వద్ద వర్షానికి దెబ్బతిన్న టమాటా తోట

బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి, న్యూస్‌టుడే: ముసురు వాన పంటలను నిలువునా ముంచేసింది. వాతావరణ మార్పులు.. చిరుజల్లులతో కూడిన వానకు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షానికి బంతి, చామంతి, టమోటా, కాలీఫ్లవర్ పంటలు కుళ్లిపోయి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. పలమనేరు, పుంగనూరు, కుప్పం ప్రాంతాల్లో వందల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిని రైతులకు అపారనష్టం వాటిల్లింది.

టమాటాకు నల్లమచ్చ తెగులు

వర్షాలతో టమోటా పంటను నల్లమచ్చ తెగులు ఆశించి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రెండు కోతలకే టమోటా మొక్కల్లో ఆకులు నల్లగా మారిపోయి పూత, పిందె నేల రాలుతోంది. లక్షల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు ఇలా దెబ్బతినడంతో రైతుల పరిస్థితి గోరు చుట్టుపై రోకలి పోటులా మారింది. కాలీఫ్లవర్ పంట కుళ్లిపోయి పురుగులు పట్టి తోటల్లోనే వదిలేసే దుస్థితి నెలకొంది.


పెట్టుబడి ఖర్చులు దక్కలేదు



రెండున్నర ఎకరాల్లో టమాటా పంట సాగు చేశా. పంట సాగుకు రూ.2 లక్షలు పైగా ఖర్చు పెట్టా. 15 రోజులుగా కురిసిన వర్షానికి పంటను నల్లమచ్చ తెగులు ఆశించి మొక్కలు నశించిపోయాయి. రెండు కోతలు కోయగానే పంట దిగుబడి పతనమైంది. మార్కెట్లో ధర ఉన్నా పంట చేతికి అందక నష్టాల్లో మిగిలాయి. లక్షన్నర పైగా పెట్టుబడి నష్టపోయా.

- గంగోజీ, రైతు, బసవరాజుకండ్రిగ, పెద్దపంజాణి మండలం


కాలీఫ్లవర్ కుళ్లిపోయింది



ఎకరం విస్తీర్ణంలో కాలీఫ్లవర్ సాగు చేశా. పంట సాగుకు రూ.60 వేలు పెట్టుబడి పెట్టా. పంట చేతికొచ్చే సమయంలో వానకు దెబ్బతింది. కాలీఫ్లవర్ వానకు తడిసి కుళ్లిపోయి పురుగులు పట్టింది. పంట కోత కోయకుండా తోటలోనే వదిలేశా. మార్కెట్లో ధర ఉన్నా పంట చేతికి అందక నష్టపోయా. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

- శ్రీనివాసులు, రైతు, చిన్నపురం, బైరెడ్డిపల్లె మండలం

నేలవాలిన వరి పంట



ఎకరం విస్తీర్ణంలో వరి పంట సాగు చేశా. సాగుకు రూ.30 వేలు ఖర్చు చేశా. పంట కోత దశకు రాక ముందే గాలివానకు నేల వాలింది. నేలవాలిన పంటను కోత కోయడం కష్టం. కూలీల ఖర్చులు రెట్టింపు అవుతాయి. వానలు ఇలాగే కురిసి ధాన్యం రంగు మారి మొలకెత్తితే నష్టం తప్పదు.

- రఘురామిరెడ్డి, రైతు, చిన్నపురం, బైరెడ్డిపల్లె మండలం


టపాసులు పేల్చుతున్న రైతులు

పంట దక్కితేనే దీపావళి

చేతికి అందిన కూడు నోటికి అందకముందే నేలపాలవుతున్నట్లు ఉంది చిత్తూరు జిల్లాలోని రైతుల పరిస్థితి. ఇప్పటికే వర్షాలతో ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి అందకపోగా మిగిలిన అరకొర పంటలను రక్షించుకునేందుకు పనిలో పడ్డారు రైతులు. చిత్తూరు జిల్లాలో పంటలకు అధికంగా ఏనుగులు, కోతులతో ఇబ్బందులు ఉంటాయి. జిల్లాలో సోమల మండలం ఇప్పలపల్లి పంచాయతీలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను ఇప్పటికే పలుమార్లు ఏనుగులు చేసి నష్టపరిచాయి. ప్రస్తుతం దీపావళి పండగ ఉండటంతో చేతికి అందిన బంతిపూలను ఏనుగులు, కోతుల నుంచి రక్షించుకునేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నపాటి రాకెట్ టపాసులు పేల్చి పంటలను బతికించుకుంటున్నారు. పండుగ సమయంలో పంట చేతికి అందితే నాలుగు కాసులు వస్తాయని వారు నానా తంటాలు పడుతున్నారు.

- ఈనాడు, చిత్తూరు; న్యూస్‌టుడే, సోమల

నూతన కోర్టులో క్యాంటీన్ ప్రారంభం


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర న్యాయవాద మండలి ఛైర్మన్ నల్లారి ద్వారకనాథరెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: స్థానిక హై రోడ్డులోని నూతన జిల్లా కోర్టు సముదాయంలో బుధవారం నూతన క్యాంటీన్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఉదయం నూతన కోర్టు భవన ప్రాంగణంలో క్యాంటీన్‌ను రాష్ట్ర న్యాయవాద మండలి ఛైర్మన్ నల్లారి ద్వారకనాథరెడ్డి ప్రారంభించారు. న్యాయవాదులు, కోర్టు అధికారులు, ఉద్యోగులు, కక్షిదారులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని ద్వారకనాథరెడ్డి నిర్వాహకులకు సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్‌ఆనంద్‌యాదవ్, న్యాయవాదులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ మునిచంద్ర

విద్యుత్తు సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యలను సత్వరమే పరిష్కరించి, వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ పేర్కొన్నారు. విద్యుత్తు సమస్యలపై జిల్లా వ్యాప్తంగా ఈఈ, డీఈఈ కార్యాలయాల్లో బుధవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. చిత్తూరు అర్బన్ డివిజన్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేను ఎస్ఈ పరిశీలించారు. ఈఈ మునిచంద్ర, డీఈఈలు ప్రసాద్, ఆనంద్, ఏఈలు పాల్గొన్నారు.

గణనాథుడి హుండీ ఆదాయం రూ.1.24 కోట్లు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా 22 రోజుల్లో రూ.1,24,94,275 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో పి.గురుప్రసాద్ తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో బుధవారం కానుకల లెక్కింపు చేపట్టారు. 45 గ్రాముల బంగారం, 859 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో వివరించారు. యూఎస్ఏ 1,011, ఆస్ట్రేలియా 170, సింగపూర్ 60, కెనడా 20 డాలర్లు, యూఏఈ 135 దిర్హమ్స్, 50 యూరోలు వచ్చినట్లు తెలిపారు. అన్నదానం హుండీ ద్వారా రూ.221,872, గో సంరక్షణ ద్వారా 13,870 ఆదాయం వచ్చిందన్నారు. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, అధికారులు, ఆలయ, స్థానిక గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బెంగళూరులో భవంతి కూలి 8 మంది విషాదాంతం

* మృతుల్లో చిత్తూరువాసి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: బెంగళూరు బాబూసాబ్‌పాళ్యలో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవంతి మంగళవారం సాయంత్రం కూలిపోవడంతో శిథిలాల కింద చిక్కుకుని మరణించిన వారి సంఖ్య బుధవారానికి ఎనిమిదికి చేరింది. మంగళవారం రాత్రి అర్మాన్ (26) అనే బిహారుకు చెందిన కార్మికుడి మృతదేహాన్ని వెలికి తీశారు. బుధవారం మధ్యాహ్నం వరకు మహ్మద్ సాహిల్ (19), మణికంఠన్ (26), సత్యరాజ్ (25), శ్రీరాన్ త్రిపాల్ (35), సోలో పాశ్వన్, శంకర్, చిత్తూరు జిల్లాకు చెందిన తులసిరెడ్డిని మృతులుగా గుర్తించారు. ఇంటి యజమాని కుమారుడు భువన్, నిర్మాణ ఇన్‌ఛార్జులు మోహన్‌రెడ్డి, ఏళుమలైలను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఇంటి యజమాని, మేస్త్రీ కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. నాలుగు అంతస్తులను నిర్మించేందుకు అనుమతి ఇవ్వగా, ఆరు అంతస్తులను కడుతున్నా పట్టించుకోలేదన్న ఆరోపణలపై అధికారి కే వినయ్‌ను సస్పెండ్ చేస్తూ పాలికె కమిషనర్ తుషార్ గిరినాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఘటన జరిగిన ప్రాంతానికి లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్ వెళ్లి పరిస్థితులను సమీక్షించారు. అనుమతిని ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు.

ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లకు ఉత్తర్వులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాల్లో భద్రతా సిబ్బంది, పారిశుద్ధ్య విభాగం, మానవశక్తిని అందించే వ్యవస్థలకు సంబంధించి టెండర్లను కేంద్రీకృత ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో నిర్ణయించేలా దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల నిబంధనలు పాటించలేదని, నాణ్యత పట్టించుకోలేదని, టెండర్ల నిర్వహణ దోషభూయిష్టంగా జరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

నివేదిక ఆధారంగా దర్యాప్తు

జీడీనెల్లూరు, పాలసముద్రం, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా నూజివీడు ప్రభుత్వాసుపత్రిలోని తెదేపా ఎంపీటీసీ సభ్యుడు జగన్నాథరాజు మృతదేహాన్ని బుధవారం సీఐ లక్ష్మీనారాయణ పరిశీలించారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, శవపరీక్షలో హత్యా, గుండెపోటా? అని నివేదిక వచ్చాక దర్యాప్తు కొనసాగిస్తామని ఆయన చెప్పారు. గురువారం జగన్నాథరాజు మృతదేహాన్ని పాలసముద్రం మండలానికి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. కాగా నిందితులు 11 మందిని నూజివీడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మల్లప్ప కొండకు మహర్దశ

● సందర్శించిన జేసీ విద్యాధరి ● అభివృద్ధిపై సమీక్ష

గుడుపల్లె, న్యూస్‌టుడే: గుడుపల్లె ప్రాంతంలో ఎంతో ప్రాధాన్యం కలిగిన పర్యాటక కేంద్రం మల్లప్ప కొండను అన్నివిధాలా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో బుధవారం జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసీ విద్యాధరి, కుప్పం, పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి.ఎస్.మునిరత్నం, మండల తెదేపా అధ్యక్షుడు టి.ఎం.బాబు, స్థానిక నేతలు, అధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలసి మల్లప్పకొండపై నెలకొన్న మల్లేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు, వినోదాన్ని ఆస్వాదించేందుకు తరలివచ్చే పర్యాటకులకు అవసరమైన మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించేందుకు సుదీర్ఘంగా చర్చించారు. అవసరమైన ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తీర్మానించారు. మల్లప్ప కొండ ప్రాంతంలో కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన 'డస్ట్ టు ద క్లౌడ్స్' నిర్వాహకుడు జయదాసుమీనన్ ఆధ్వర్యంలో జరుగుతున్న బైక్ రేస్‌లో జేసీ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి.ఎస్.మునిరత్నం, పలువురు స్థానిక తెదేపా నేతలు పాల్గొన్నారు. జేసీ విద్యాధరి, పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ శ్రీకాంత్ స్వయంగా బైక్‌లపై మల్లప్ప కొండపైకి చేరుకోవడాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	115
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	241
లేయర్ మాంసం	195


గుడుపల్లె: బైక్ రేసింగ్ కోసం సిద్ధమైన జేసీ విద్యాధరి ←

ఉచ్చుకు చిక్కి చిరుత బలి

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: యాదమరి మండలం తాళ్లమడుగు సమీప అటవీ ప్రాంతంలో మృతి చెందిన చిరుత ఉచ్చులో చిక్కి ప్రాణాలు కోల్పోయినట్లు స్పష్టమైంది. చిరుత కళేబరాన్ని పోస్టుమార్టం చేసిన తిరుపతి ఎస్వీ జూ వైద్యులు చిరుత ట్రోమాటిక్(బాధాకరమైన) షాక్‌తోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆ దిశగా అటవీశాఖ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పలువురిని విచారించగా, తాళ్లమడుగు సమీప ప్రాంతంలోని బంగారుపాళ్యం మండలం వెలుతురు చేను గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అనుమానితునిగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లోనే చిరుత మృతికి బాధ్యులైన వారిని అరెస్టు చూపి వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

రెండు నెలల కిందట భార్య మృత్యువాత


రెడ్డినాయక్ (పాత చిత్రం)

రామకుప్పం, కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఒంటరి ఏనుగు దాడిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన రామకుప్పం మండలం పీయంకే తండాలో బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, అటవీ అధికారుల వివరాల మేరకు.. పీయంకే తండాకు చెందిన రెడ్డినాయక్(46) భార్య ప్రమీల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. భార్య మృతితో అతను రోజు మద్యం తాగుతూ సాయంత్రం వేళలో భార్య సమాధి వద్దకు వెళ్లి బాధపడేవారు. రోజు లాగే మంగళవారం రాత్రి మద్యం తాగి భార్య సమాధి వద్దకు వెళ్తుండగా గ్రామ సమీపంలో ఒంటరి ఏనుగు ఒక్కసారిగా దాడి చేసి తొక్కి చంపినట్లు తెలిపారు. బుధవారం ఉదయం పశువుల కాపరులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుప్పం ఎఫ్ఆర్వో జయశంకర్, కుప్పం గ్రామీణ సీఐ మల్లేశ్‌యాదవ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.


బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ఆర్థిక సాయం అందజేత. రెడ్డినాయక్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా అటవీశాఖ అధికారిణి భరణి, డా.సురేశ్‌బాబు ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల చెక్కును అందించారు.

నిప్పంటించుకుని వ్యక్తి బలవన్మరణం


సుహేల్ (పాతచిత్రం)

పలమనేరు: పట్టణంలోని మాస్కువీధికి చెందిన సుహేల్(27) ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని మృతిచెందాడు. బుధవారం సాయంత్రం కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. భార్య తన మూడేళ్ల కొడుకుతో కలిసి రెండు రోజుల కిందట పుట్టింటికి వెళ్లింది. ఇంటి నుంచి దట్టమైన పొగ రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే అతను మృతి చెందాడని పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి మహ్మద్ రఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పళణి తెలిపారు.

కోరిక తీర్చలేదనే.. కార్మికురాలి హతం.. కోలారు, న్యూస్‌టుడే: కూలీ కార్మికురాలు యశోదమ్మ(30)ను హత్య చేసి పరారైన కుప్పం పట్టణానికి చెందిన సంతోశ్ కుమార్(32)ను కర్ణాటకలోని మాలూరు ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బెంగళూరులో పలు నేరాలకు పాల్పడి నాలుగుసార్లు కారాగారానికి వెళ్లిన నిందితుడు జామీనుపై బయట ఉంటున్నాడు. మాలూరు శివార్లలోని లేఅవుట్‌లో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న అతను తనతో కలిసి పనిచేస్తున్న కార్మికురాలు యశోదపై కన్నేశాడు. అతని కోరిక తీర్చేందుకు నిరాకరించడంతో అక్టోబరు 15న ఆమెను హత్య చేసి పరారయ్యాడు. పోలీసులు గాలింపు పూర్తి చేసి ఆ వ్యక్తిని అరెస్టు చేశారు.

పంటలపై ఏనుగుల గుంపు స్వైర విహారం


టమాటా సాగును ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని చల్లావారిపల్లె, పాతపేట, కల్లూరు తదితర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు పంట పొలాలపై స్వైర విహారం చేశాయి. చల్లావారిపల్లెకు చెందిన శ్రీనివాసులునాయుడు పొలంలో అర ఎకరా వరి పంటను తొక్కి, బొప్పాయి, అరటి చెట్లు నాశనం చేశాయి. శేషాద్రి నాయుడు సాగు చేసిన ఎకరా టమోటా, ఎకరా వంకాయ తోటను ధ్వంసం చేశాయి. ఆదికేశవులునాయుడుకు చెందిన ఐదు బస్తాల వేరుశెనగ కాయలను తినేశాయి. పాతపేటకు చెందిన సుబ్రహ్మణ్యం మామిడి తోటలో నాలుగు కొబ్బరి చెట్లు, రైతు వెంకటరమణ సాగు చేసిన మామిడి తోటలోని పది కొబ్బరి చెట్లను నేల కూల్చాయి. శ్రీరాములు పొలానికి నాటిన రాతి కూసాలను ధ్వంసం చేశాయి.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

10 మండలాల్లో వర్షం

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మంగళవారం రాత్రి జిల్లాలోని 10 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. పూతలపట్టు మండలంలో 35.0 మి.మీటర్లు, బైరెడ్డిపల్లె 29.2, పాలసముద్రం 26.4, పెనుమూరు 11.2, ఐరాల 10.2 మి.మీటర్లు కురవగా... మిగిలిన మండలాల్లో చిరుజల్లుల వర్షపాతం నమోదైంది.

రాష్ట్రస్థాయి పోటీలకు నెల్లేపల్లె బాలికలు

జీడీనెల్లూరు: రాష్ట్రస్థాయి క్రీడలకు నెల్లేపల్లె హైస్కూలుకు చెందిన ఐదుగురు బాలికలు ఎంపికైనట్లు హెచ్ఎం సుబ్బరత్నమ్మ బుధవారం తెలిపారు. వీరిలో యామిని(పదో తరగతి) వాలీబాల్‌కు, గగన(తొమ్మిదో తరగతి) ఫుట్‌బాల్‌కు, కుసుమ, కీర్తిక, భవ్యశ్రీ(ఎనిమిదో తరగతి) హాకీ క్రీడలకు ఎంపికైనట్లు వివరించారు.

స.హ.చట్టంపై అవగాహన పొందాలి

జీడీనెల్లూరు: ప్రభుత్వ కార్యక్రమాల్లో పారదర్శకత, అవినీతి నిర్మూలన కోసం ప్రవేశపెట్టిన సమాచారహక్కు చట్టంపై అవగాహన పొందాలని నగరి ప్రాంతీయ వ్యవసాయశాఖ ఉప సంచాలకురాలు సౌభాగ్యలక్ష్మి రైతులను కోరారు. బుధవారం స్థానిక ఆత్మ కార్యాలయంలో స.హ. చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోలు భవాని(జీడీనెల్లూరు), డిల్లీప్రసాద్(పాలసముద్రం), నర్మద(శ్రీరంగరాజపురం), ఎంపీఈవోలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల ప్రారంభం

కార్వేటినగరం, న్యూస్‌టుడే: కార్వేటినగరంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు. భక్తులు కుమార్‌ఆచారి, ధనాయాదవ్, బాబురెడ్డి, ధనశేఖర్, మణి, దాము, గుణశేఖర్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే:

సమస్య: స్థానిక దుర్గానగర్ కాలనీలో మురుగు కాలువలు చెత్త, వ్యర్థాలతో పూడిపోయాయి. -స్థానికులు

సమాధానం: కాలువల్లో పూడికతీత పనులు చేపడతాం.

- అనిల్ కుమార్, నగరపాలక ఆరోగ్యాధికారి

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే:

సమస్య: స్థానిక రైతుభరోసా కేంద్రం సమీపంలో రక్షిత మంచినీటి సరఫరా గేట్‌వాల్ పాడైపోయి నీరు వృథాగా పోతోంది. నీరు ప్రవహించే తారుమార్గం పాడైపోవడంతో పాటు పారిశుధ్యం లోపించింది. **- రవిచంద్ర, స్థానికులు**

సమాధానం: పంచాయతీ సిబ్బందితో గేట్‌వాల్‌ను బాగు చేయిస్తాం. **- చంద్ర, పంచాయతీ కార్యదర్శి**

రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోండి

నింద్ర, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యలు ఉంటే పరిష్కరించుకోండని నగరి రెవెన్యూ డివిజన్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి ప్రజలకు సూచించారు. పాదిరిలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. అర్జీదారుల ఫిర్యాదులను పరిశీలించారు. తహసీల్దారు శేషగిరిరావు పాల్గొన్నారు.

గుడిపాల, న్యూస్‌టుడే: పాపసముద్రం గ్రామంలో జరిగిన గ్రామసభలో 109 వినతులు అందాయి. పాత పద్ధతిలోనే పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని రైతులు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డిని కోరారు. సర్వేయర్ కిరణ్, గ్రామ సర్వేయర్ ప్రకాష్, వీఆర్వో భవదీప్ తదితరులు పాల్గొన్నారు.

దుస్థితిలో మురుగు కాలువలు

● మరమ్మతులు, నిర్మాణాలపై దృష్టి సారించని వైనం
● నగరి పురపాలికలో ఇదీ పరిస్థితి

నగరి, న్యూస్‌టుడే: నగరి పురపాలక సంఘంగా మారిన నాటి నుంచి కొత్తగా ఏర్పడే కాలనీల్లో మురుగు కాలువల ఏర్పాటు, కొత్త సిమెంట్ రోడ్ల నిర్మాణాలపై చూపించిన శ్రద్ధ, పాత వీధుల్లో పరిస్థితిపై దృష్టి పెట్టలేదు. 2005 సంవత్సరం ముందు మేజర్ పంచాయతీ కాలంలో నిర్మించిన నాటి పాత వీధుల్లో మురుగు కాలువలు శిథిలావస్థకు చేరాయి. పురపాలక సంఘంగా ఏర్పడి 19 సంవత్సరాలు దాటినా పాత వీధుల్లో పరిస్థితి మాత్రం మారలేదు. ఆ వీధుల్లో నడిచి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. మురుగునీరు మొత్తం వీధుల్లోని రోడ్డుపైనే ఉంటుంది. కొత్త మురుగు కాలవలు నిర్మించే పరిస్థితి లేని, పాత వీధుల్లో కాలువలు ఆధునీకరించాల్సిన అవసరం ఉంది.



బ్రాహ్మణ వీధిలో శిథిలావస్థలో మురుగుకాలువ

ఏయే వీధుల్లో అంటే..

నగరి పట్టణంలో ప్రధానంగా ఆదం కాలనీ, తలారీ వీధి, రాసప్పకాలనీ, పుదుపేట, బ్రాహ్మణ వీధి, పద్మావతి నగర్, ఎన్టీఆర్ నగర్, నగరి దళితవాడలలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటుంది. బ్రాహ్మణ వీధిలో కాలువ కుప్పగా కూలి ఒరిగిపోయింది. ఈ కారణంగా మురుగు ప్రవహించడం ఆగిపోయి దుర్గంధ భరితంగా మారింది. ఈ వీధిలో ఒక ప్రైవేటు పాఠశాల ఉంది. నిత్యం చిన్నారులు ఈ కాలువ దాటి పాఠశాల వైపు వెళ్తుంటారు. దుర్వాసనతో అనారోగ్య వాతావరణంగా మారిన ఈ కాలువను ఆధునికీకరించి పరిశుభ్ర పరిస్థితిని కల్పించాల్సిన అవసరం ఉంది.



తలారి వీధిలో..

చినుకుపడితే మడుగులే

తలారీ వీధిలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. కాలువ చిన్నదిగా, ఛిద్రమై, శిథిలమై ఉండటంతో మురుగు మొత్తం నడివీధిలోనే ఉంటుంది. ఈ వీధిలో వెళ్లాలంటే మురుగునీటిలో కాలు పెట్టాల్సిందే. ఆదం కాలనీలో చినుకుపడితే చాలు వర్షపునీరు, మురుగునీరు కలిసి వీధిలో మడుగుగా మారుతుంది. ఇక్కడ రోడ్డు, కాలువ ఎత్తు పెంచాల్సిన అవసరం ఉంది. ఇదే పరిస్థితి తలారీ వీధి, రాసప్పకాలనీలలో నెలకొంది.

వరద బాధితులకు రూ.25 వేల వితరణ

ఐరాల, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల తరఫున రూ.25,796 ఆర్థిక సహాయాన్ని డీడీ రూపంలో ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌కు ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు, సిబ్బంది బుధవారం అందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయ్‌కుమార్ ఉన్నారు.



ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే మురళీమోహన్‌కు అందిస్తున్న ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు, సిబ్బంది

కూటమి ప్రభుత్వంలో చెరువులకు మహర్దశ

ఐరాల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం హయాంలో చెరువులకు మహర్దశ రానున్నట్లు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ తెలిపారు. మండలంలోని ఐరాల పంచాయతీలో ఉన్న బీరప్పచెరువును బుధవారం పరిశీలించారు. జలహారతి సమర్పించి స్థానిక విలేకరులతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో చెరువులు, కాలువలు సరైన మరమ్మతులు లేక దెబ్బతిన్నాయన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో చెరువులకు గండ్లు పడకుండా తూముల మరమ్మతులు చేపడుతామన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు వడ్లపాటి గిరిధర్‌బాబు, జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు లత, భాజపా నాయకుడు రాజేష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభ చాటేందుకు ఉపయుక్తం



విజేతలతో ప్రధానోపాధ్యాయిని ద్రాక్షాయణి, ఉపాధ్యాయులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుకోవడానికి పోటీ పరీక్షలు ఎంతో ఉపకరిస్తాయని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని ద్రాక్షాయణి అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీ పరీక్ష నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషియల్ మీడియా ప్రభావం' అంశంపై ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పరీక్ష రాశారు. విద్యార్థుల పోటాపోటీగా పరీక్ష రాయగా న్యాయ నిర్ణేతలు విజేతలను ప్రకటించారు. ప్రేమకుమార్, లాస్య, మీనాక్షి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని ద్రాక్షాయణి ప్రశంసాపత్రంతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీలతో నైపుణ్యాల పెంపు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయినులు

పుత్తూరు, న్యూస్‌టుడే: వ్యాసరచన పోటీలతో నైపుణ్యాలు పెంచుకోవచ్చని ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం పుత్తూరు పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. సమస్య తీవ్రతను విభిన్న కోణాల్లో విశ్లేషించి పరిష్కార మార్గాలను సూచించడం ద్వారా తమలోని ప్రతిభను విద్యార్థులు ఆవిష్కరించారు. విజేతలుగా నిలిచిన కీర్తి, నూరుల్ హసిని, సంజనలకు ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి, ఉపాధ్యాయులు పుష్ప, రాజేశ్వరి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

నెట్‌బాల్, బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

నగరి, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరి, ఏకాంబరకుప్పంలో బుధవారం నెట్‌బాల్, బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఏకాంబరకుప్పంలో అండర్-14 విభాగంలో నెట్‌బాల్ పోటీలు నిర్వహించి జట్టును ఎంపిక చేశారు. పీసీఎన్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో బ్యాడ్మింటన్ జట్టును ఎంపిక చేశారు. ఏకాంబరకుప్పం ప్రధానోపాధ్యాయులు సముక్షాయుడు, పీసీఎన్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామలాదేవి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత, పీడీ సురేష్‌బాబు, కోచ్‌లు పాల్గొన్నారు.



నగరి పీసీఎన్ ఉన్నత పాఠశాలలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలో ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న రాజేంద్రుడు

పరీక్షలపై భయం వీడాలి

పుత్తూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు రాజేంద్రుడు పేర్కొన్నారు. పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం గురుకుల పాఠశాలలో పరీక్షలపై భయం వీడాలి అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.


కలెక్టర్‌ను కలిసిన పలమనేరు ఆర్డీవో

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ సుమిత్ కుమార్‌ను పలమనేరు ఆర్డీవోగా నియమితులైన వెంకటేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలి

నగరి, న్యూస్‌టుడే: పట్టణంలోని పళ్లిపట్టు రోడ్డు, నాగలాపురం రోడ్లలో ఆక్రమణలు పెరిగిపోయాయని, ఎవరికి వారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ నీలమేఘం అధ్యక్షతన బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆక్రమణదారులు రెండు రోజుల్లో తొలగించుకోకపోతే తామే తొలగిస్తామని హెచ్చరించారు.

తాగునీటి వృథా



పెనుమూరు మండలంలోని చిప్పారపల్లె పంచాయతీ గొబ్బిళ్లమిట్ట గ్రామంలో తాగునీటి పైపు మరమ్మతుకు గురై నీరు వృథాగా పోతోంది. ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా గ్రామానికి సరఫరా తాగునీటి పైపులైను సరైన నిర్వహణ లేక తరచూ నీరు వృథా అవుతున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. నీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి జ్యోతీశ్వర్‌ను వివరణ కోరగా సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. **- న్యూస్‌టుడే, పెనుమూరు**

అర్హులకు పింఛన్లు అందించాలి



చిత్తూరులో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్

చిత్తూరు గ్రామీణ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు అందించిన సూపర్ సిక్స్ హామీల్ని తక్షణమే అమలు చేసి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ అన్నారు. మంగసముద్రం హౌసింగ్ కాలనీలో బుధవారం లెనిన్‌నగర్ పార్టీ శాఖ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నగర పరిధిలోని కాలనీలు, దళితవాడల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు అర్హులైన వృద్ధులకు పింఛన్లు అందించాలన్నారు. నాయకులు మణి, సత్యమూర్తి, ఆర్ముగం, విజయకుమార్, రమాదేవి, విజయగౌరీ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్వారీల అనుమతులు రద్దు చేయాలి

నగరి, న్యూస్‌టుడే: నగరి సమీపంలోని క్వారీలకు అనుమతులు రద్దుచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు డిమాండ్ చేశారు. నగరిలో సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరికి సమీపంలోని రైతుల పశువుల మేత పోరంబోకు స్థలంలో నడుపుతున్న క్వారీలను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, బాషా తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

పుత్తూరు, న్యూస్‌టుడే: నలభై సంవత్సరాలు నిండిన మహిళలు విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని టాటా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డాక్టర్ వెంకయ్యబాబు పేర్కొన్నారు. స్థానిక ఎస్వీఎస్ కాలనీలో రాస్ ఆధ్వర్యంలో టాటా ట్రస్టు సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టాటా ట్రస్టు డాక్టర్లు, సిబ్బంది అమరావతి, రెడ్డికుమారి, మహేంద్ర, రాస్ సిబ్బంది ప్రకాష్, కమలమ్మ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో ప్రభాస్ అభిమానులు

ప్రభాస్ అభిమానుల సేవా కార్యక్రమాలు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: సినీ హీరో ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం చిత్తూరులోని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో అభిమానులు రక్తదానం చేశారు. మధ్యాహ్నం నగరంలోని దీనులకు అన్నదానం చేశారు. స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బస్టాపు వద్ద కేక్ కోసి అభిమానులకు పంచిపెట్టారు. నాయకులు రాజేష్, తులసీకృష్ణ, సాయిహరితేజ, అంజాద్, బాలాజీ, జనా, వినోద్, వెంకీ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ఎస్పీ ప్రశంస

జీడీనెల్లూరు: చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసిన బృందంలో ఒకరైన జీడీనెల్లూరు పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ దామోదరానికి బుధవారం చిత్తూరు నగరంలో ఎస్పీ మణికంఠ చందోలు ప్రశంసాపత్రం అందజేశారు. అంతర్జాలం ద్వారా దొంగలను గుర్తించి, సెల్‌ఫోన్ల రికవరీలో చక్కగా పనిచేసి అవార్డు పొందిన దామోదరంను సీఐ లక్ష్మీనారాయణ, పోలీసు బృందం అభినందించారు.

ర్యాలీ విజయవంతానికి పిలుపు

చిత్తూరు గ్రామీణ: సీపీఎం జిల్లా మహాసభల సందర్భంగా ఈ నెల 26న జరిగే ర్యాలీలో ప్రజా సంఘాలు, సీఐటీయూ అనుబంధ సంఘాలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ముఖ్యనేత సమావేశం బుధవారం జరిగింది. నాయకులు గంగరాజు, జ్యోతి, గిరిధర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన బ్యాటర్లు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 మల్టీడే క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా కడప వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడపతో జరిగిన మ్యాచ్‌లో రెండో రోజు మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 330/9 పరుగులు చేసింది. తనీశ్వర్ టెండూల్కర్ సెంచరీ(104, 174 బంతుల్లో, 16×4)తో సత్తాచాటగా, అభిరామ్‌యాదవ్ 47 పరుగులు చేశాడు. కృష్ణచైతన్య 2, ఫైజాన్ 3 వికెట్లు తీశారు. కడప మొదటి ఇన్నింగ్స్ స్కోరు:316/8.

నర్సుల సంఘం అధ్యక్షురాలిగా రాధమ్మ

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ప్రభుత్వ నర్సుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షురాలిగా రాధమ్మ ఎన్నికయ్యారు. ఆరేళ్లుగా నర్సింగ్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరగలేదు. మూడు వర్గాలు ఎవరికివారు తామే నాయకులమంటూ ప్రకటించుకుని.. అధికారుల వద్ద పైరవీలు చేసేవారు. దీంతో ప్రభుత్వం సంఘం గుర్తింపును పక్కన పెట్టింది. తాజా పరిస్థితిని ప్రభుత్వానికి విన్నవించుకోగా.. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించిన నర్సింగ్ ఎన్నికలను కోఆపరేటివ్ సొసైటీ బుధవారం నిర్వహించింది. అధ్యక్షులుగా రాధమ్మ, కార్యదర్శిగా లీలావతి, కోశాధికారిగా ఎం.సర సుభాషిణి, ఉపాధ్యక్షులుగా రాణి, సభ్యులు వరలక్ష్మి, శివమ్మ, పద్మావతి, చంద్రావతి, హిమబిందు ఎన్నికయ్యారు.



డిక్లరేషన్ తీసుకుంటున్న రాధమ్మ ప్యానల్ సభ్యులు



కప్పు అందుకుంటున్న చిత్తూరు బాలుర జట్టు

వాలీబాల్ పోటీల్లో చిత్తూరు జట్టు విజయం

హిందూపురం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లిలో నిర్వహించిన 68వ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్-17 వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. బాలుర విభాగంలో చిత్తూరు జట్టు, బాలికల విభాగంలో గుంటూరు జట్టు విజేతలుగా నిలిచాయి. బాలికల విభాగంలో చిత్తూరు, గుంటూరు జిల్లా జట్లు ఫైనల్‌కు చేరాయి. ఈ రెండు జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో గుంటూరు జట్టు విజేతగా నిలిచింది. చిత్తూరు ద్వితీయ, అనంతపురం తృతీయ, ప్రకాశం జట్టు నాల్గో స్థానంలో నిలిచాయి. విజేతలకు అతిథులు కప్‌లు, పతకాలు అందించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటుహక్కు అవసరం

నగరి, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కావాలంటే ఓటు హక్కు కలిగి ఉండాల్సిన అవసరం ఉందని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వేణుగోపాల్ పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం ఓటుహక్కు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు బీఎల్‌వో ద్వారా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. టీపీవో మూర్తి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.భాస్కరరాజు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ యువరాజ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

పంచాయతీల్లో పనులు సర్పంచులకు తెలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దీప

నింద్ర, న్యూస్‌టుడే: ప్రభుత్వం పంచాయతీల్లో చేపట్టే పనులను సర్పంచులకు తెలియజేయకుండా ఇటీవల భూమిపూజ కార్యక్రమాలను అధికార పార్టీ నాయకులు చేపడుతున్నారని పలువురు సర్పంచులు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయావరణలో ఎంపీపీ దీప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. కైపాకం-పాదిరి గ్రామాల నుంచి ప్రధాన రోడ్డు వరకు విద్యుత్తు లైట్లు వేయాలని కోరారు. శాఖల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పనుల గురించి అధికారుల సమావేశంలో ప్రజాప్రతినిధులకు వివరించారు. ఉప ఎంపీపీలు దుర్గాదేవి, శుభా, ఎంఈవో వసుమతిదేవి, పీఆర్ఏఈ వీరభద్రయ్య, గృహనిర్మాణశాఖ ఏఈ శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్తు అందించాలి

పెనుమూరు, న్యూస్‌టుడే: మండలంలో రైతులు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరంగా విద్యుత్తు సరఫరా చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు. బుధవారం ఆయన విద్యుత్తు ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్టీఆర్ జలాశయం వద్ద విద్యుత్తు లైన్లను పరిశీలించి మరమ్మతుకు గురైన వాటిని మార్పు చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఏఈ తులసిప్రసాద్, లైన్ ఇన్‌స్పెక్టర్లు పద్మనాభనాయుడు, ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనం పెంచుదాం

బంగారుపాళ్యం: మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచుదామని బంగారుపాళ్యం పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పల్ త్రిపాఠి వందన తెలిపారు. స్థానిక కళాశాలలో బుధవారం గ్రేడ్స్ సంస్థ, నెహ్రూ యువక కేంద్ర ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. గ్రేడ్స్ సంస్థ అధ్యక్షుడు శేషాద్రి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సకాలంలో రేషన్ అందించాలి

పాలసముద్రం: లబ్ధిదారులకు రేషన్ సరుకులను సకాలంలో అందించాలని తహసీల్దారు అరుణకుమారి పేర్కొన్నారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. విధుల్లో ఎలాంటి అలసత్వం చేయకుండా చురుగ్గా పనిచేసి పంపిణీ శాతాన్ని పెంపొందించాలని తెలిపారు. డీటీ నాగరాజు, నరసింహులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

జీడీనెల్లూరు: నీవా నది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం జిల్లా భూగర్భగనుల శాఖాధికారులు పట్టుకొని జీడీనెల్లూరు పోలీసులకు అప్పగించారు. విచారణ చేసి, నిందితులపై కేసు నమోదు చేయనున్నట్లు సీఐ లక్ష్మీ నారాయణ తెలిపారు.



పోలీస్‌స్టేషన్ వద్ద టిప్పర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: మండలంలోని కలికిరిండ్లు గ్రామానికి సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. తమిళనాడులోని కర్లంబాకం గ్రామానికి చెందిన భార్యభర్తలు తరుణ్, నిఖిత తిరుపతికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా మార్గమధ్యలోని కలికిరిండ్లు గ్రామానికి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తరుణ్, నిఖిత తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ వైద్యులు సకాలంలో వైద్య సేవలు అందించకపోవడంతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. అనంతరం క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్య సేవల నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

కొండచిలువ పట్టివేత

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ బంగ్లా పరిసరాల్లోని చెట్టుపై పాకుతున్న కొండచిలువను అటవీ శాఖ సిబ్బంది పట్టుకుని రిజర్వు అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. మంగళవారం రాత్రి చెట్టుపై కొండచిలువ తిరగటాన్ని గుర్తించిన బంగ్లా సిబ్బంది.. అటవీ శాఖ వారికి సమాచారమిచ్చారు. పాముల్ని పట్టే వ్యక్తిని తీసుకొచ్చి ఐదు గంటలపాటు శ్రమించి.. కొండచిలువను పట్టుకున్నారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కొండచిలువను సురక్షిత ప్రాంతంలో వదిలిపెట్టారు.

మునీశ్వరస్వామి ఆలయంలో చోరీ

నగరి, న్యూస్‌టుడే: నగరి పట్టణ శివారులోని మునీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, హర్డ్‌డిస్క్ బాక్సును ధ్వంసం చేశారని, రెండు హుండీలలో నగదు చోరీ చేశారని చెప్పారు. ఆలయం తలుపులు, గేట్లు విరగ్గొట్టి ఫర్నీచర్ పూర్తిగా నాశనం చేశారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

తప్పిపోయిన బాలిక

రెండు గంటల్లోనే ఆచూకీ లభ్యం

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలో బాలిక అదృశ్యం కలకలం రేపింది. అరగొండకు చెందిన 12 ఏళ్ల బాలిక తల్లితో కలిసి రాయచోటిలోని బంధువుల ఇంటికి వచ్చింది. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక కనిపించకపోవడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే బాలిక కోసం పోలీసులు అన్ని ప్రధాన కూడళ్లు, సీసీ కెమెరాల ఆధారంగా గాలించారు. మధ్యాహ్నం రెండు గంటలకు కొత్తపేట సెంటర్‌లో ఆచూకీ లభ్యమైంది. దీంతో బాలికను స్టేషన్‌కు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించామని పట్టణ సీఐ పి. చంద్రశేఖర్ పేర్కొన్నారు.

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవు

కల్లూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపం ఏర్పడితే కఠిన చర్యలు తప్పవని డీపీవో ఇన్‌ఛార్జి డీపీవో ప్యారేజీ హెచ్చరించారు. బుధవారం పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి నెల 31వ తేదీలోగా ఇంటి పన్నులతో పాటు ఇతర పన్నులను వందశాతం వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ల జీతాలు ప్రతినెలా కచ్చితంగా చెల్లించాలన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

పలమనేరు, న్యూస్‌టుడే: పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని పలమనేరు శాసనసభ్యులు అమరనాథరెడ్డి సూచించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో సభ్యత్వ నమోదు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ కాలం నాటి నుంచి కూడా ఈ విషయంలో కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేసేవారని అన్నారు. కార్యక్రమంలో బాలాజీ కోఆపరేటివ్ సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్బీబాలాజీ, నాయకులు కిషోర్‌గౌడు, రంగనాథ్, సోమశేఖరగౌడు, నాగరాజురెడ్డి, ఆర్బీసీ కుట్టి, విజయభాస్కరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, గిరిబాబు, కాజా, నాగరాజు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్య ధోరణి చూపించరాదు



సమావేశంలో మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యధోరణి చూపించరాదని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, రహదారులు, పైప్‌లైన్ల పనుల వివరాలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి సహకారం వస్తున్నా కొందరు అధికారులు అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యంగా పనిచేయడంపై మండిపడ్డారు. ముఖ్యంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను హెచ్చరించి గ్రామాల్లో తాగునీటి సరఫరా మెరుగు పరచాలన్నారు.

నిబంధనల ప్రకారమే వ్యాపారాలు చేసుకోవాలి

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో గల ఖాళీ స్థలాన్ని బుధవారం అధికారులు పరిశీలించారు. ఏటా దీపావళికి బాణసంచా దుకాణాలు ఇక్కడే ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఖాళీ స్థలం చుట్టూ ప్రభుత్వ కార్యాలయాలు, నివాస గృహాలు ఉండడంతో భద్రత దృష్ట్యా వేరే స్థలం చూసుకోవాలని లైసెన్సుదారులకు సూచించారు. విక్రయదారులు నిబంధనల మేరకే వ్యాపారాలు చేసుకోవాలని ఆదేశించారు. అగ్నిమాపకశాఖ అధికారులు పరిశీలించిన తర్వాత స్థలాలను ఖరారు చేస్తామని తహసీల్దారు రాము తెలిపారు. కార్యక్రమంలో పురపాలక కమిషనరు మధుసూదనరెడ్డి, అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నాడు నిధుల దుర్వినియోగం

☆ నేడు నిధుల కొరత ☆ చీకట్లో పట్టణ ప్రాంతం

పలమనేరు, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలో వీధి దీపాల ఏర్పాటు ఒక ప్రహసనంగా సాగుతోంది. దానికి ఒక లెక్క అంటూ ఉండదు. ఎన్ని దీపాలు వేశారు.. ఎంత నిధులు ఖర్చుచేశారు అన్న వివరాలు కచ్చితంగా ఉండవు. లెక్కల్లో మాత్రం దీపాలు వేసినట్లు ఉంటాయి. వాస్తవంగా చూస్తే మాత్రం దీపాలు ఉండవు. ప్రస్తుత పట్టణంలో పలు ప్రాంతాలు రాత్రి సమయంలో చీకట్లో మగ్గుతున్నాయి. కొన్ని చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడం, కొన్ని చోట్ల దీపాలు వెలగకపోవడంతో ప్రజలు చీకట్లో అవస్థలు పడుతున్నారు. గత వైకాపా పాలనలో పాలకవర్గం దీపాల కోసం ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ.4 లక్షల వరకు కొనుగోలు కోసం ఖర్చు పెట్టింది. ఇలా లెక్కపక్కా లేకుండా ఖర్చులు చూపించినా ఏడాది పొడవునా చీకట్లో ఉన్న ప్రాంతాలు లేకపోలేదు. ప్రస్తుత నూతన పాలకవర్గం ఖర్చుపెట్టాలన్నా నిధులు చాలక అవస్థలు పడుతోంది. ఆర్థిక ఇబ్బందులు మున్సిపాలిటీని వదలటంలేదు. ప్రస్తుతం దీపాలు కొనుగోలు చేయడానికి నిధులు లేక అవస్థలు నెలకొన్నాయి.

దీపాలు లేని ప్రాంతాలు

పట్టణంలో దీపాలేలేని ప్రాంతాలు 20 శాతం ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఉన్నట్లు లెక్కలు చెబుతున్న ప్రాంతాల్లో సైతం దీపాలు వెలగని ప్రదేశాలు చాలానే ఉన్నాయి. గంటావూరు కాలనీ, గద్దూరుకాలనీ, షికారి కాలనీ, దండపల్లె రోడ్డు, రొంటకుంట్ల ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగటంలేదు. ఇక పట్టణంలోని ప్రధాన ఎంబిటి రహదారిలో డివైడర్ మధ్యన ఏర్పాటు చేసిన దీపాల్లో సగానికి సగం వెలగటం లేదు. ఒక స్తంభానికి రెండు దీపాలు ఉంటే ఒకటి మాత్రమే వెలుగుతుంటుంది. పెద్దచెరువుకట్ట మీద దీపాలు వెలగటం లేదు. దీపాలు కొనుగోలు చేయడానికి నిధులు ఖర్చుపెడుతున్నారు. అయితే అవి చాలా వరకు దుర్వినియోగం అవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రతియేటా దాదాపు రూ.12 లక్షలు దీపాల కోసం ఖర్చుపెడుతున్నా చీకట్లు మాత్రం తప్పడంలేదు.

మున్సిపాలిటీలో జనాభా	: 51 వేలు
వార్డులు	: 26
స్లమ్స్	: 37
జనాభా	: 11039

లెక్కల్లో ఉన్న వీధి దీపాలు

హైమాస్ దీపాలు	:6
ఎన్సీలాంప్స్	:102
ఎంవీ లాంప్స్	:118
ట్యూబ్ లైట్స్	:1866
సోలార్ దీపాలు	:25
ఎల్ఈడీ దీపాలు	:26



దీపాలు వెలగని ప్రాంతం

ప్రత్యేక దృష్టి సారిస్తాం

దీపాలు ఏర్పాటు చేసే విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రస్తుతం నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే. ఇక మీదట రికార్డులు నిర్వహించి దీపాల లెక్కలు సక్రమంగా ఉండేలా చూస్తాం.

- చాముండేశ్వరి, మున్సిపల్ ఛైర్‌పర్సన్, పలమనేరు



టిడ్కో ఛైర్మన్ అజయ్‌కుమార్‌ను కలిసిన ఎన్వీఆర్ ట్రస్టు అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, జనసేన నాయకులు

టిడ్కో ఛైర్మన్‌ను కలిసిన నాయకులు

పుంగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర టిడ్కో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అజయ్‌కుమార్‌ను బుధవారం విజయవాడలో టిడ్కో పరిపాలన భవనంలో పుంగనూరు జనసేన పార్టీ నాయకులు పగడాల రమణ, విరూపాక్షి, ఎన్వీఆర్ ట్రస్టు అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో శుభాకాంక్షలు తెలుపుతూ వినతులను అందించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, జనసేన నాయకులు చైతన్య, నరేష్, భూషణ్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ పనుల ప్రారంభం

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ పనులను బుధవారం ప్రారంభించారు. పురాతనమైన ఈ ఆలయం ఆవరణలో గల ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో మూడేళ్ల కిందట తొలగించారు. ఆస్థానంలో తిరిగి ధ్వజస్తంభం ప్రతిష్ఠించడానికి అర్చకులు, భక్తులు ముందుకు వచ్చారు. దాతల విరాళాలతో చేపడుతున్న ధ్వజస్తంభం ప్రతిష్ఠ, ప్రహరీ నిర్మాణ ఈ పనులు కార్తీక సోమవారాలు ప్రారంభం నాటికి పూర్తి చేయనున్నట్లు అర్చకులు బాలసుబ్రమణ్యం, రాము తెలిపారు.

వ్యాసరచనలో విద్యార్థుల ప్రతిభ



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులు ఇంటర్‌నెట్ వలన కలిగే లాభాలు, సామాజిక మాధ్యమాలతో విద్యార్థులపై ప్రభావం అంశాలపై వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు. 9వ తరగతికి చెందిన దీక్ష ప్రథమ, నఫీజాతాజ్ ద్వితీయ, పదో తరగతి విద్యార్థిని మోక్షశ్రీ తృతీయ సాధించారు. పాఠశాల ప్రిన్సిపల్ లోకేష్ బహుమతులను అందించారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులు



కలెక్టర్‌ను కలసిన పలమనేరు ఆర్డీవో

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ సుమిత్ కుమార్‌ను పలమనేరు ఆర్డీవోగా నియమితులైన వెంకటేష్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

అభివృద్ధి పనులు ఎందుకు చేపట్టడం లేదు

పలమనేరు, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశంలో సూచించిన అభివృద్ధి పనులను ఎందుకు చేపట్టడంలేదని ఎంపీపీ రోజా అధికారులను ప్రశ్నించారు. బుధవారం ఆమేరకు వినతి పత్రాన్ని ఎంపిడీవో ఖాదర్‌బాషాకు అందించారు. ఈనెల 16వ తేది నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా జగమర్ల గ్రామంలో పైపులైను నిర్మాణం, మొరంలో సిమెంటు రోడ్డు, బయప్పగారిపల్లె గ్రామంలో మంచినీటి ట్యాంకు నిర్మాణాన్ని చేపట్టాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఆ పనులను ఎందుకు ఇంకా మొదలు పెట్టలేదని ఆమె నిలదీశారు. జిల్లా పరిషత్ నుంచి మంజూరైన రూ.32 లక్షల నిధులకు ప్రతిపాదనలు ఎందుకు తీసుకోలేదని అడిగారు. వీటిపై 3 రోజులలోపు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని కోరారు. వైకాపా నాయకులు విశ్వనాథరెడ్డి, బాలాజీనాయుడు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న ఎంపీపీ రోజా

అభద్రతలో విద్యార్థుల ప్రయాణం

బస్సులు లేక ఇక్కట్లు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థుల ప్రయాణం రోజురోజుకు గండంగా మారుతోంది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రానికి పుంగనూరు నుంచి ఒక్క ఆర్టీసీ బస్సు కూడా నడపడం లేదు. అటు వైపు వెళ్లాలంటే ఆటోలే దిక్కు. స్థానిక ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఆటోలను ఆశ్రయించి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లేందుకు బాలబాలికలు బస్సులు, ఆటోల కోసం పుంగమ్మ చెరువు కట్ట రోడ్డుపై ప్రతిరోజు ఎండలో వేచి ఉంటున్నారు. రామసముద్రంకు ఆర్టీసీ బస్సు నడపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై న్యూస్‌టుడే ఆర్టీసీ పుంగనూరు డిపో మేనేజర్ కె. సుధాకరయ్య దృష్టికి సమస్యను తీసుకెళ్లగా.. రెండు నెలలుగా ఆపేశామని, పరిశీలించి తిరిగి బస్సు నడిపేందుకు చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.



రామసముద్రం వైపు ఆటోలో జడ్పీ పాఠశాల విద్యార్థినుల



పుంగమ్మ చెరువు కట్టపై ఎండలో బస్సులు, ఆటోల కోసం

గుంతల దారులు.. తప్పని అవస్థలు



బెండనకుప్పం వద్ద బీటీ రోడ్డులోని గుంతల్లో నీటి మడుగులు

శాంతిపురం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామీణ తారురోడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. దాదాపు 20 ఏళ్ల కిందట నిర్మించిన రోడ్లను గడచిన ఐదేళ్లలో వైకాపా సర్కారు పట్టించుకోలేదు. భారీ వాహనాల రాకపోకలతో పాటు ఏటా వర్షాలకు దెబ్బతిన్న రహదారులు గుంతలమయమై ప్రయాణీకులకు అవస్థలు కలిగిస్తున్నాయి. శాంతిపురం- కేజీఎఫ్ అంతరాష్ట్ర మార్గాలు దుస్థితికి చేరుకున్నాయి. బెండనకుప్పం, కోనేరుకుప్పం, శిద్ధావూరు రహదారుల్లో ప్రయాణాలకు జనం తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని ర.భ విభాగం ఏఈ క్రిష్ణానాయక్ తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడుతామని అన్నారు.



చెంగుబళ్ల వద్ద బురదమయంగా మారిన బీటీ రహదారిపై వాహనదారుల అవస్థలు

ఉచిత వైద్య శిబిరం

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలోని రాయలపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం తిరుమల పాల డెయిరీ ఆధ్వర్యంలో పీఈఎస్ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రాయలపేట పరిసర గ్రామాల ప్రజలు, పాఠశాల విద్యార్థులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుమల డెయిరీ రీజినల్ మేనేజరు ప్రభాకర్‌రెడ్డి, మేనేజరు కేవీ రాజన్న, సిబ్బంది, పీఈఎస్ వైద్యులు సక్‌లైన్, సూర్యవంశీ, రూపాంజలి, జోషిక, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెదేపా ఆర్థిక సాయం

రామకుప్పం, న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్త ముబారక్ తల్లి రశీదాబీ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతి పట్ల బుధవారం తెదేపా మాజీ ఎంపీపీ అంజనేయరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు టి.వి.రవి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, బూత్ కన్వీనరు మంజునాథ్ తదితరులు రశీదాబీ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

రామకుప్పం, న్యూస్‌టుడే: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కుప్పం గ్రామీణ సీఐ మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పెనుమూరు వద్ద గల ఏపీ ఆదర్శ పాఠశాలలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, బాల్యవివాహాలు, క్రమశిక్షణపై అవగాహన కల్పించారు. యువత వాహనాలు నడిపేటప్పుడు తప్పక శిరస్త్రాణం వాడాలని సూచించారు.

బాలకార్మికులను పనిలో పెట్టుకోరాదు

పుంగనూరు, న్యూస్‌టుడే: బాలకార్మికులను పనిలో పెట్టుకోరాదని స్థానిక లేబర్ ఆఫీసరు మధుబాబు అన్నారు. బుధవారం పట్టణంలో గుజిరీ, వస్త్ర, బంగారు దుకాణాలు, ప్రొవిజినల్ స్టోర్స్, టీ అంగళ్లు, మెకానిక్ షెడ్లలో వివిధ శాఖల సిబ్బందితో కలసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ నవంబరు 20వరకు ఈ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బాలకార్మికులు ఉంటే కేసులు నమోదు చేసి జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులు, పోలీసులు పాల్గొన్నారు.

వీధుల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు

సోమల, న్యూస్‌టుడే: గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షానికి మండలంలోని అన్నెమ్మగారిపల్లె గ్రామంలో పలు వీధులు జలమయం అయ్యాయి రాకపోకలకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ బెన్నురాజ్ గ్రామానికి వెళ్లి గ్రామస్థులతో చర్చించి జేసీబీ సహాయంతో గ్రామంలో నీరు నిల్వ ఉండకుండా చొరవ తీసుకొన్నారు.

మహిళ ఆత్మహత్య కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప రిమ్స్ ఠాణా పరిధిలో ఓ మహిళ మృతికి కారకుడైన వ్యక్తికి కడప కోర్టు ఏడేళ్లు జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. కడప బుడ్డాయపల్లెలో ఓ మహిళ నివసిస్తోంది. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా వి.కోట మండలానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి ఆమెను చనిపోవడానికి ప్రేరేపించాడు. దీంతో 2021, నవంబరులో ఆ మహిళ ఆత్మహత్య చేసుకుంది. అప్పటి రిమ్స్ సీఐ నరేంద్రరెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుడిని బుధవారం కడప ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్ ఎదుట హాజరుపరచగా, నేరం రుజువు కావడంతో వెంకటేష్‌కు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.



రైతులకు వివరిస్తున్న జేడీ మురళీకృష్ణ

కొత్త వంగడాలపై దృష్టి పెట్టాలి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రైతులు సాంకేతిక పరిజ్ఞానం మరియు నూతన పద్ధతులపై దృష్టి సారించి కొత్త వంగడాలతో అధిక దిగుబడులు, ఆదాయం పొందేందుకు కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాగానిపల్లెలో రైతు వ్యవసాయ క్షేత్రంలో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలకు అధిక రసాయనిక మందులు ఉపయోగిస్తే పొలం నిస్సారమై చీడ పీడలు అధికమవుతాయన్నారు. అనంతరం డ్రోన్ ద్వారా పిచికారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ శివకుమార్, ఏవో ఫయాజ్, వివిధ శాఖల అధికారులు, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

కల్లూరు : ప్రకృతి వ్యవసాయంతో రైతులు మంచి ఆదాయంతో పాటు ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయలు తినడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉండవని డీపీఎం వాసు తెలిపారు. బుధవారం మండలంలోని పాతపేట గ్రామానికి చెందిన రైతు రాజేంద్ర సాగు చేసిన వేరుశెనగ పంటను పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు, వీహెచ్‌ఏ శ్రీనివాసులు, ఎన్ఎఫ్ఏలు గురుప్రసాద్, ఫజున్నీషా తదితరులు పాల్గొన్నారు.

వర్షం పడితే తప్పనిపాట్లు

సోమల-నంజంపేట మార్గంలో స్థానిక సచివాలయం సమీపంలో తారురోడ్డు గుంతలమయమైంది. కొద్దిపాటి వర్షానికే నీరు నిలుస్తోంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- న్యూస్‌టుడే, సోమల



నీటి వృథా

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని అతిపెద్దచెరువు ఇరికిపెంట చెన్నపట్నంచెరువు. ఈ చెరువులో నీరు ఉంటే ఇరికిపెంట, సోమల, నంజంపేట, పొదలకుంటపల్లె, 81.ఉప్పరపల్లె తదితర పంచాయతీల్లో రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఎగువప్రాంతం నుంచి నీరు చెరువులోకి చేరుతోంది. తూములు మరమ్మతుకు గురికావడంతో నీరు వృథాగా వంకకు వెళ్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తూముకు మరమ్మతులకు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

పలమనేరు : పట్టణంలోని బొరుగులబట్టి వీధిలో మున్సిపల్ సిబ్బంది కొత్తగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మేమున్నా మీకు తోడుగా అనే శీర్షికలో వీధి దీపాలు వెలగటం లేదని ఈనాడు ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం ఉదయం మున్సిపల్ సిబ్బంది దీపాలు మార్చి వెలిగేలా చేశారు.

చెత్తాచెదారం తొలగింపు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి గోపిశెట్టిపల్లెలో ఎంపీడీవో లీలామాధవి ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది గ్రామంలోని రోడ్లపైన, మురుగు నీటి కాలువల్లో చెత్త, వ్యర్థాలను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ నెల 17న మేమున్నాం.. మీకు తోడుగాలో వచ్చిన సమస్యకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించారు.



పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలో బుధవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో వాన కురిసింది. పాతూరునత్తం రేవణ సిద్ధేశ్వరస్వామి ఆలయ సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు కాలిపోయింది. మంగళవారం రాత్రి లక్కనపల్లె సమీపంలో వ్యవసాయ పొలాల్లో పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు కాలిపోయింది.

మొక్కలు నాటి పచ్చదనం పెంచుదాం

బంగారుపాళ్యం: మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచుదామని బంగారుపాళ్యం పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పల్ త్రిపాఠి వందన తెలిపారు. స్థానిక కళాశాలలో బుధవారం గ్రేడ్స్ సంస్థ, నెహ్రూ యువక కేంద్ర ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. గ్రేడ్స్ సంస్థ అధ్యక్షుడు శేషాద్రి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

19 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలో బుధవారం పోలీసులు వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేసి 19 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మద్యపానం సేవించి వాహనాల నడుపుతున్న ఒక్కొక్కరి నుంచి రూ.10 వేలు చొప్పున రూ.1.90 లక్షలు జరిమానా వసూలు చేసినట్లు పేర్కొన్నారు.

శిథిలావస్థకు వంతెనలు

● ప్రజలకు తప్పని ఇబ్బందులు
● ఆ వైపు చూడని అధికారులు



రామసముద్రం రోడ్డులో పుంగమ్మ చెరువుకట్టపై శిథిలావస్థకు చేరిన వంతెన

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు నియోజకవర్గంలో జాతీయ, రహదారుల భవనాల శాఖ పరిధిలోని పలు మార్గాల్లో వంతెనలు శిథిలావస్థకు చేరుకోగా పలు చోట్ల నిర్మాణానికి నోచుకోలేదు. ఏటా వర్షాకాలంలో స్థానికులు బిక్కు, బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. 2015లో కురిసిన భారీ వర్షాలతో ఈ నియోజకవర్గంలోని మొరవలు, వంకలు, వాగుల్లో 5 మంది మృత్యువాత పడ్డారు. ఓ మాదిరి వర్షం కురిసినా సోమల, సదుం మండలాల్లో గార్గేయనది, కొర్లకుంటవారపల్లె ప్రాజెక్టు మొరవలు పారుతున్నాయి. వంతెనలు, కల్వర్టులు లేకపోవడంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

సంఘటనలివీ..

● సదుం-కలికిరి మార్గంలోని వంతెనపై ఓ మహిళ కొట్టుకుపోయి మృతి చెందారు.

● సదుం-పీలేరు మార్గంలో పాపిరెడ్డిగారిపల్లె ప్రాజెక్టు నీరు ప్రవహించే రోడ్డుపై వంతెన లేకపోవడంతో సదుం మండలానికి చెందిన దంపతులు గార్గేయ నదీ ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందారు.

● సదుం మండలంలోని కొర్లకుంటవారి పల్లె ప్రాజెక్టు-తిమ్మానాయునిపల్లె మధ్యలో ఉన్న వాగులో కొర్లకుంటవారిపల్లెకు చెందిన యల్లప్ప(53) కొట్టుకుపోయి మృతి చెందారు.

● 2015లో కురిసిన భారీ వర్షాలతో చిన్నకంపల్లెకు చెందిన తండ్రీ, కుమార్తె బసవపల్లె వద్ద గార్గేయనదిలో కొట్టుకుపోయి మృతి చెందారు. నేటికీ కొర్లకుంటవారిపల్లె వద్ద, సోమల మండలంలోని గార్గేయనది కాలువపై పలు చోట్ల వంతెనలు నిర్మించాల్సి ఉంది.

వంతెనలు, కల్వర్టుల అవసరం

పురపాలక కేంద్రమైన పుంగనూరు మీదుగా పొరుగు రాష్ట్రాలకు ప్రధాన, జాతీయ రహదారులు ఉన్నాయి. పుంగనూరులో గత వరదల్లో నెలకొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వంతెనల నిర్మాణం, మరమ్మతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. తిరుపతికి వెళ్లే మార్గంలో కొత్తపేటలో రాయలచెరువు కాలువపై, ముంబై-చెన్నై జాతీయ రహదారిలో ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా, ఇందిరా కూడలిలో, రామసముద్రం మార్గంలో ఔట్‌పోస్టు వద్ద పుంగమ్మ చెరువుకట్టపై నిర్మించిన వంతెనలకు మరమ్మతులు లేవు. ఈ మార్గాల్లో వంతెన పునర్నిర్మాణాలు, విస్తరణలు చేపట్టాల్సి ఉంది.



పెద్దఉప్పరపల్లె-చౌడేపల్లె మార్గంలో సీతమ్మ చెరువు వంకపై వంతెన నిర్మించాల్సిన ప్రాంతం